# బాస్

అంబల్ల జనార్ధన్



"ఏమిటిది సుభాష్ ? ఇంత సర్వీసు, అనుభవం ఉన్న మీ నుండి ఇలాంటి పని ఎక్స్పెక్ట్ చేయలేదు" మా రీజనల్ మేనేజర్ కేబిన్‌లో అడుగుపెట్టానో ,లేదో అక్షింతల వర్షం కురిసింది.

"ఏమయింది సార్ ? ఏ పని గురించి, మీరు మాట్లాడేది ? "

'ఇంకా ఏంకావాలి ? పోయిన నెల మీరు చేసిన ప్రియారిటీ సెక్టర్ స్టేట్ మెంట్ గురించి, చూడండి. జి. ఎమ్.గారు ఎంత స్ట్రాంగ్‌గా రాసారో ? ఏదైనా స్టేట్‌మెంట్ తయారుచేశాక క్రాస్ చెక్ చేయకపోతే ఎలా ?"

"అది మీరు సూచించినట్టుగానే తయారుచేశాను సార్ ! మీరు చెక్ చేశారు కూడా అందులో నా తప్పేముందీ ? "కాస్త ఘాటు గానే అన్నాను.

"మీ తప్పేం లేదు ! మీకు ఆ పని అప్పగించడం నా తప్పు. సరే! వెంటనే ఇవి రెక్టిఫై చేసి ఇవ్వండి. సవరించిన స్టేట్ మెంట్ తోపాటు నా సంజాయిషీ ఇవ్వాలి. మీ పేరు రిపోర్టు చేయక తప్పదు! "

ఉక్రోషం వచ్చింది కాని స్థాన బలిమి కదా!

ఏమనలేక నా సీటు దగ్గరకు వచ్చాను.

నా మనసు కుతకుత లాడుతోంది.

"రీజనల్ మేనజర్ గా తన బాధ్యతేం లేదు. కాని, గుమాస్తాగా నాది తప్పట! పేరు రిపోర్టు చేస్తాడట! చేయనీ నాకేం భయమా ? మా యూనియన్ లేదూ?

నాకు మొమో రానీ, అప్పుడు చూస్తాను. ఈయన మార్పులు చేసిన చిత్తుకాపీ నా దగ్గర భద్రంగా ఉంది. ! అది హెచ్. ఓ. పంపితే నా తడాఖా తెలుస్తుంది."

నెల క్రితం జోనల్ మేనేజరు వచ్చినపుడు...."

"అన్నిట్లోకీ మీ రీజన్ ప్రాపిట్ ప్లాన్ చాలా బాగుందండీ. చాలా పకడ్బందీగా తయారుచేసారు. కంగ్రాచ్యులేషన్స్' జోనల్ మేనేజరు.

"దాందేముంది సార్! ఇన్ని సంవత్సరాల అనుభవం అక్కరకు వచ్చింది ". నక్క వినయం ప్రదర్శించాడు రీజనల్ మేనేజర్ .

"అనుభవం అందరికీ ఉంటుందండీ! మీలా కార్పోరేట్ ప్లాన్‌ను అర్థంచేసుకునేదెంతమందీ?"

"థాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్ సార్"

నిజానికి ఆ ప్రాఫిట్ ప్లాన్ తయారు చేసింది నేను. దాంట్లో ఎవరి ప్రమేయమూ లేదు. కాని నా పేరు జోనల్ మేనేజరుకు చెప్పాడా ? లేదు. అంతా తన ప్రతాపం అన్నట్టు పోజుకొట్టాడు. ఇప్పుడు ? హెడ్డాఫీసు నుంచి శ్రీ ముఖం వస్తే నా పేరు రిపోర్ట్ చేస్తానని బెదిరింపు! క్రెడిట్ తనకి, డెబిట్ కింది ఉద్యోగులకి!

ఈ ఆఫీసర్లంతా ఇంతే!

అన్యమనస్కంగా ఇంటికి వచ్చాను .

కాఫీ ఇస్తూ శ్రీమతి "చూశారా , మన రోహిణి మళ్ళీ లెక్కల్లో తప్పింది. "

ఇంకా ఆఫీసు హాంగోవర్‌లోనే ఉన్న నాకు అగ్గిలో ఆజ్యం పోసినట్టయింది.

రమ మీద విరుచుకుపడ్డాను.

"తప్పక ఏం చేస్తుంది? నీకు పిల్లలపై ... ఉంటేగా! టిఫిన్ బాక్స్ , వాటర్ బ్యాగ్ ఇచ్చి స్కూ... ...పగానే సరికాదు. బి.ఏ.చదివిన దానివి, ఇం... ...ర్చొని ఆ మాత్రం చదువు చెప్పకపోతే ఎలా ? "

"కిరీటికి చెప్పడం లేదా? ... బుద్ధిగా చదువుకుంటున్నాడు ? కాని రోహిణి! ... గారాల పట్టి కదూ ? నేను కొడితే దాన్ని వెనకేసుకొచ్చేది మీరే కదా !అయినా పరీక్షలప్పుడు దానికి లె...కు నేర్పింది మీరు కాక నేనా ? " రమ ఏమీ తక్కువ తినలేదు.

"అంటే నేను లెక్కలు నేర్పడం వల్ల అది ఫెయిలయ్యిందా? లెక్కల్లో నాకు నూటికి నూరు మార్కులొచ్చేవి తెలుసా ? "

"తెలుస్తూనే ఉంది మీ తెలివి! అప్పుడప్పుడూ నన్నడం, మీ కలవాటేగా !"

ఇక లాభంలేదు. అస్త్ర సన్యాసం చేయాల్సిందే.

రూటు మార్చేను.

"మన కిరీటి రిజల్ట్ మాటేమిటి? "

"బాబుకేం, ఎనభై ఆరు శాతం మార్కులొచ్చాయి. క్లాసులో 'సెకెండ్ ర్యాంక్'. లేని కాలర్ ని ఎగరేసింది.

"ఎంతయినా వాడు 'నా' కొడుకుకదా!"

"అవును నవమాసాలు మోసి కన్నారు!రోజూ మీరే చదువుచెప్పారు! మరి అమ్మాయి ? "

"అమ్మాయి ... మనమ్మాయేగాని దానికి నీ బుద్ధులే వొచ్చాయి" ఉడికించాను.

"బాగుండదండీ వరస. అబ్బాయికి మంచి మార్కులొస్తే, అది మీ ప్రతాపం ! అమ్మాయి ఫెయిలయితే నా తప్పు అంతేనా ? మీ మగాళ్ళంతా ఇంతే !"

నా నోటికి తాళం పడింది.

ఇంట్లో నేను బాస్‌నే కాని... ఒక్కొప్పుడు , స్థాన బలిమి కంటే , తన బలిమిదే పై చేయి అవుతుంది.

సడన్‌గా మా బాస్ జ్ఞప్తికి వచ్చాడు!

బాస్ లంతా ఇంతే !

అందరిదీ ఒకే మనస్తత్వం!

అంబల్ల జనార్ధన్
ఎ/36, శివకీర్తి కో. హౌ. సొ. లి.,
చించోలి , బందర్ రోడ్, మాలాడ్ (వెస్ట్)
బొంబాయి - 400 064